# రాణీ వియోగం

శ్రీ "చంద్రం"

నేను గుర్తెరిగినప్పట్నుంచి యిప్పటివరకు అనేక మంది చచ్చిపోయారు. అందులో అయిన వాళ్లున్నారు; కాని వాళ్లూ వున్నారు. కొంచెం దగ్గర వాళ్లూ కొంచెందూరంవాళ్లూ వున్నారు. సాక్షాత్తూ నా తలిదండ్రుల్ని కనిపెంచి, తమ చివరిదశలో వారి మనమణ్ణయిన నా బుగ్గలు పుణికి ముద్దుకొని మురిసిపోయే ముసలివాళ్లూ వున్నారు. చివరికి మాయ మర్మం ఎరుగక, నిష్కళంకమైన వెన్నెల్లాంటి చిర్నగవులు వెదజల్లే చిన్నారి పాపలూ వున్నారు. కాని యిందులో ఏ ఒక్కరుగాని చచ్చిపోయారన్న వార్త విన్న తర్వాత నాలో ఎలాంటి సంచలనం కలగలేదు. నా విచారాన్ని వ్యక్తం చేసేందుకు కనీసం నా కనుగొలకుల్నుంచి ఒక్క కన్నీటిచుక్కగూడా రాల్లేదు. అందుక్కారణం ప్రత్యేకంగా ఏమీ చెప్పలేనుగాని, ఈ నాడు మా రాణి చచ్చిపోయిందన్న మాట విన్నవెంటనే ఒక్కక్షణం స్తబ్ధుణ్ణైపోయాను. నా చుట్టూ పరిసరాలు అంధకారమయమైపోయినట్టూ, నా శరీరంలో నరనరంలో నిస్సత్తువ వ్యాపించినట్టు అనిపించి, అక్కణ్ణుంచి కదల్లేక అలాగే నిలుచుండిపోయి, అయోమయంగా చూడసాగాను. మా రాణి మృతకళేబరాన్ని చూసిన క్షణం, నా హృదయంలో వుబికి వుప్పొంగిన దుఃఖానికి చిహ్నంగా రెండు కన్నీటి బిందువులు నా రెండు కళ్లల్లోనూ నిలిచినయ్.

*　　*　　*

సరిగ్గా ఆర్నెల్లక్రితం... స్వంత వూరికి సుమారు ఆరవైమైళ్ల దూరంలో వుంటూ, హోటల్ తిండీ మఠంనిద్రతో బాటు బ్రహ్మచర్యం నిర్వర్తిస్తూ ఒక మాదిరి ఉద్యోగాన్ని వెలగబెడుతున్న నేను, నాలుగు రోజులు శలవు చూసుకొని ఒక శుభదినాన మా స్వగ్రామం బయల్దేరి వెళ్లాను.

రాక రాక వచ్చిన నన్నుచూసి మా వాళ్లంతా అమందానందకందళితహృదయారవిందులై పోయారు. మా వాళ్లంతా అంటే ఎంతోమంది లేరు. లెక్కకు నలుగురు—మా అమ్మా నాన్నా చెల్లీ తమ్ముడూ.

ఆ నాడు నా రాక మా యింట్లో ఒక పండుగనాటి వాతావరణాన్ని సృష్టించింది.

అంతకుముందురోజునే యిల్లలికి, సున్న ముగ్గులు పెట్టినట్టున్నారు...యిల్లంతా కళకళలాడుతోంది. పల్లెటూళ్లలో యిల్లలికి ముగ్గు పెట్టినరోజు పూరిళ్లే చూడముచ్చటగా వుంటాయి.

సాయంత్రం నాలుగు—నాలుగున్నర కావచ్చింది. అమ్మ పొయ్యిముందు కూచుంది. హోటల్ తిండి తింటున్న నేను చాలా చిక్కిపోయానట! అసలు హోటల్‌వాళ్లు పెట్టేతిండి తిండేకాదట! వాళ్లంతా డబ్బులు తీసుకుని గడ్డిపెడుతున్నారట! ఆ విషయం గురించి చాలాసేపు బాధపడుతూ మాట్లాడింది అమ్మ. తర్వాత—'ఇక్కడున్న నాలుగురోజులైనా కొంచెం మంచితిండి తిను నాయనా' అంది. ప్రస్తుతం ఏదో పిండివంట ప్రయత్నంలో వుంది.

బజార్లమ్మటపడి చెడతిరగటం అలవాటులేదుగాని, సాయంత్రంవేళ పల్లెటూళ్లో పంటపొలాల పరిసరప్రాంతాల్లో షికారు వెళ్లటమంటే నాకెంతో యిష్టం. కాని, ప్రస్తుతం అమ్మ ఏదో పిండివంట ప్రయత్నంతో వుండటంవల్ల నా షికార్ని గురించిన ప్రయత్నం విరమించుకొని, వంటింట్లోనే ఒక పక్కగా పీట వేసుక్కూచున్నాను.

అమ్మ ఏవేవో అడుగుతోంది. అన్నింటికీ ఓపిగ్గా సమాధానాలు చెపుతున్నాను. అమ్మ అడిగే ప్రశ్నలన్నీ నా ఆరోగ్యంగురించీ, తిండి గురించీను. 'ఫర్వాలేదులేమ్మా'—అని ఎన్నిసార్లు చెప్పినా ఆమెకు తృప్తి కలగటంలేదు. 'ఫర్వాలేకపోవటమేమిటి వాయనా, సగానికి సగమైపోతేను!' అంది చివరికి.

ఇంతట్లోకి......పెరట్లో కుక్కలు దెబ్బలాడుకోవటం వినిపిస్తే అటు చూశాను. ఒక పెద్దకుక్క బారినుండి ఎంతో చాకచక్యంగా తప్పించుకున్న ఒక చిన్నకుక్కపిల్ల, పరుగెత్తుకుంటూ నాదగ్గర కొచ్చేసింది. వచ్చింది వచ్చిన ట్టుండక, నన్ను ఆసరాగా చేసుకుని మళ్లీ తన్ను తరిమిన ఆ పెద్దకుక్క నుద్దేశించి మొరగ సాగింది. పెద్దకుక్క నన్ను చూసి, కుక్కపిల్ల నా చాటున వుండటంవల్ల మొదట్లో కొంచెం శాంతించింది. అది చూసి 'పిల్లకుక్క' మరికొంత ధైర్యంతెచ్చుకొని రెండడుగులు ముందుకేసి 'ఇక్కణ్ణుంచి ఫో' అన్నట్టు తల జాడించి మరీ అరవసాగింది. పెద్దకుక్క బయట్నుంచే 'ఊఁ' అంది, అటు తిరిగున్నది తలమాత్రం యిటు తిప్పి—'జాగ్రత్త !' అన్నభావం స్ఫురించేలాగా. కుక్కపిల్ల మరో అడుగు ముందుకేసి, 'ముందు పోతావా, పోవా?' అన్నట్టు 'భౌభౌ' అంది. 'ఉండుఉండు, నీ పని తర్వాత పట్టకపోతానా!' అన్నట్టు ఒక చూపుమూసి మరీ తన దారిన వెళ్లిపోసాగింది పెద్ద కుక్క. చిన్నకుక్క ఉత్సాహంతో ఒక చోట నిలవలేకపోయింది. చెంగుచెంగున గెంతుకుంటూ పెద్దకుక్క వెనకపడి 'యిప్పుడైనా తెలుసుకున్నావా? నేనంటే ఏమనుకున్నావో. జాగ్రత్త!' అన్న పోజులో అరవసాగింది.

పెద్దకుక్కకు ఒళ్లుమండిపోయింది. దీని వెకిలి చేష్టలకు 'నీకు ఎంత అండదండలుంటే మట్టుకు యింత మిడిసిపాటా? నేనంటే అంత అలుసా? నేం తలుచుకుంటే యిందాకే నీ అంతు చూసి వుందును. ఇప్పుడైనా ఏం మించిపోలేదు. జాగ్రత్త!' అన్నట్టు మరోసారి కుక్కపిల్ల వంక చూసి, మామూలుగా నడిచి పోసాగింది.

ఈ సారి కుక్కపిల్ల మరీ రెచ్చిపోయింది. పట్టరాని ఉత్సాహంతో ఒంటి కాలుమీద గెంతుకుంటూవెళ్లి, పెద్దకుక్క తోక లాగింది. దాంతో పెద్దకుక్క సహనం కోల్పోయింది. చటుక్కున వెనక్కి తిరిగి కుక్కపిల్లను ఓ పట్టు పట్టబోయింది. కాని, యిది దొరికితేనా! కన్నుమూసి తెరిచేంతలో మళ్లీ నాముందు నిలుచుంది. పైగా ధీమాగా పోజు పెడ్తూ 'ఇప్పుడేం చేస్తావే?' అన్నట్టు దానివంక చూడసాగింది.

ఇంతవరకూ యిదంతా చిత్రంగా చూస్తున్న నేను యింక వాటి గొడవ పొడిగించటం యిష్టం లేక, రెండింటినీ వుద్దేశించి 'ఛీ ఛీ' అన్నాను. దాంతో పెద్దకుక్క తిన్నగా వెళ్లిపోయింది. ఈ చిన్న కుక్కపిల్ల మట్టుకు అక్కడే వుంది. అమ్మచేసిన పిండి వంటకం తింటున్న నా చుట్టూ గంగవెర్రులెత్తి తిరిగేస్తోంది. నా నోటివంకా, చేతివంకా మార్చి మార్చి చూస్తూ ముక్కు ఎగబీల్చేస్తోంది. నాకు అసహ్యంవేసింది. 'ఛీ ఛీ ఫో బైటికి' అన్నాను. అమ్మ గూడా 'ఫో ముండా, అవతలికి' అంది కాని, యిది విని పిలుచుకుంటేనా. మరికొంత కంగారుపడి, ఈ సారి మా అమ్మచుట్టూ తిరగటం ప్రారంభించింది. ఉండి ఉండి నా దగ్గరకీ, నా దగ్గర్నుంచి మా అమ్మ దగ్గరికీ పరుగెట్టసాగింది. నాకు మహచెడ్డ చిరాకేసింది. ముఖ్యంగా పిల్లలూ, కుక్కలూ అంటే నాకు మొదట్నుంచీ అసహ్యమే. ముట్టుకోటానికే అసహ్యం. పిల్లలనూ, కుక్కపిల్లలనూ పెంచే వాళ్లకి పిచ్చేమో అనుకునే వాణ్ణి. కాని అందు గురించి ఎప్పుడూ ఒక్కక్షణంగూడా నిశితంగా ఆలోచించలేదు.

'ఎక్కడిదమ్మా యీ కుక్కపిల్ల, యింత దర్జాగా యింట్లో తిరిగేస్తోంది! బైటికి పొమ్మంటే పోదు' అన్నాను చివరికి విసిగి.

అమ్మ చిన్నగా నవ్వేసింది. "చిన్నాడు ఎక్కణ్ణుంచో తీసుకొచ్చాడు. పెంచుతాడట." అంది.

'దీన్నా?' అన్నాను...నమ్మలేనంత ఆశ్చర్యంతో దానివంక చూస్తూ. నల్లగా వుంది. ఎక్కడా చిన్న మచ్చగూడా లేదు. వయసులో చిన్నదేకాబట్టి బొద్దుగావుంది. అయినా దానివంక యిష్టంగా చూడలేకపోయా న్నేను. ఎంత అందంగా వున్నా కుక్కలమీద నాకు మంచి అభిప్రాయం లేదు...... 'కనకపు సింహాసనమున శునకము...' పద్యం రాసిన సుమతీ పద్యశతక కర్తకు మల్లే.

ఇంతలోకి స్కూలునుంచి పుస్తకాలు పట్టుకొనివచ్చాడు మా తమ్ముడు. వాణ్ణి చూసీచూట్టమే, వాడు గుమ్మంబైట వుండగానే, యింక మా యిద్దర్నీ వదిలి వాణ్ణి పట్టుకుంది కుక్కపిల్ల. వాడి కాళ్లకి అడ్డంపడి ఏవిటో చెప్పటానికి తాపత్రయపడుతోంది..... మాటలురాని పసివాళ్లు తమ మనోభావాలు ఎదట వాళ్లకి తెలియచెయ్యటానికి ప్రయత్నించినట్టు.

'ఊ...రా...'అంటూ దాన్ని చేత్తో మెల్లిగా బుజ్జగించి లోపలికి తీసుకొచ్చాడు మా తమ్ముడు. ఇంక వాడిదగ్గర్నుంచి మా అమ్మదగ్గరకీ, అమ్మదగ్గర్నుంచీ వాడిదగ్గరకీ గిరికలు కొట్టసాగింది కుక్కపిల్ల. అప్పట్లో అర్థంకాకపోయినా, యిప్పుడనిపిస్తోంది......అమ్మ వండిన పిండివంటకాల ఘుమఘుమలు దాన్ని ఒకచోట నిలవనివ్వలేదని!

* * *

మళ్లీ నాకు ఐదునెల్లవరకూ శలవు దొరకలేదు. దొరక్కపోవటంకాదుగాని, ఉన్న కొద్దిపాటి లీవూ యిలా చిల్లరగా వాడెయ్యటం యిష్టంలేక, నేనే శలవుపెట్టలేదు. నిజం చెప్పాలంటే శలవు ఖర్చైపోతుందనికాదుగాని, మాటమాటకీ యింటికి వెళ్లటంవల్ల అక్కడికీ యిక్కడికీ వ్యత్యాసం తగ్గిపోతుంది. ఇంతదూరం పనికట్టుకు ఎందుకు వచ్చినట్టూ—అనిపిస్తుంది. నిజానికి ఏమీ ప్రత్యేకత కనిపించదు. అందుకనే మనసు లాగుతున్నా ఐదునెల్లూ ఓపికపట్టి, తర్వాత నాలుగురోజులు శలవుపెట్టి వెళ్లాను.

ఇంటికి వెళ్లగానే గుమ్మంలో ఎదురయ్యి నాకు స్వాగతం చెప్పింది ఒక కుక్క. నల్లగా నిగనిగలాడుతూవుంది. వయసెంత వుంటుందో చెప్పలేనుగాని, ఏపుగా పెరిగినట్టు దాని శరీరసౌష్టవం చెపుతోంది. సైజులో అంతపెద్దదీకాదు, అంత చిన్నదీకాదు.

వీథిలో, యింటిముందు నన్ను చూడగానే పరుగునవచ్చి నామీదకు ఎగబడింది. నా కాళ్లకు అడ్డంపడింది. నేను విసుక్కున్నాను. వెంటనే యింట్లోకి వెళ్లిపోయింది. నేను గుమ్మం ఎక్కేప్పటికి అమ్మ చీర చెంగునోటితో పట్టుకొని బలవంతాన లాక్కొస్తోం దా కుక్క.

'ఏమిటి వెధవముండా, ఈ అల్లరి?' అని విసుక్కుంటూనే కుక్కవెంట బైటికి వచ్చిన అమ్మ గుమ్మంలోనే నన్నుచూసి ఆనందంలో ఉక్కిరి బిక్కిరై పోయింది—

'పిచ్చిముండ! కంగారుగా బైటికి లాక్కొస్తుంటే ఏమిటో అనుకున్నా. పెద్దన్నయ్యొచ్చాడనా యింత కంగారు!' అంది అమ్మ మళ్లీ కుక్క నుద్దేశించి, నాతో.

నాకేం అర్థం కాలేదు. అయోమయంలో పడ్డాను—కుక్కేవిటి? పెద్దన్నయ్యేవిటి? కంగారేవిటి? బైటికి లాక్కురావటమేవిటి?

'పెద్దన్న య్యెవరమ్మా?' అన్నాను అమాయకంగా.

అమ్మ చిన్నగా నవ్వింది. మీదిమీదికి ఎగబడుతూ మారాం చేస్తున్న కుక్కని చంటి పిల్లవాణ్ణి సముదాయిస్తున్న తల్లిలాగా సముదాయించసాగింది.

'నువ్వే నాయినా పెద్దన్న య్యంటేను. మన చిన్నాడు చిన్నన్నయ్యా నువ్వు పెద్దన్నయ్యాను దీనికి. ఇది మన చిన్నాడు పెంచుతున్న కుక్కేకదా!' అంది.

నాకు ఈసారి మరీ ఆశ్చర్యం కలిగింది. ఆశ్చర్యంతోపాటు కొంచెం కోపంగూడా వచ్చింది. లేకపోతే, కుక్కలంటేనే నాకు పరమ అసహ్యం; అలాంటిది ఈ నల్లకుక్కకి నేను అన్నయ్యేమిటి?

'కుక్కకి నే నన్నయ్యేమి టమ్మా?' అన్నాను కొంచెం కోపంగా.

అమ్మ మళ్ళీ చిన్నగా నవ్వింది. 'అయ్యో పిచ్చి తండ్రీ!' అన్నభావంతో. 'వాడు దీన్ని స్వంత చెల్లెలాగా చూసుకుంటాడు నాయనా! యిదిగూడా అన్నయ్యను పిలుచుకు రమ్మంటే వాడెక్కడున్నా వరే వెదికి చొక్కాపట్టి లాక్కొస్తుంది. కుక్కకున్న విశ్వాసం మనుషులక్కూడా వుండదనుకో!' అంది.

అమ్మ ధోరణి నా కర్థం కాలేదు.

ఆ కుక్కవంక ఒక్కసారి దీక్షగా చూశాను. నల్లగా, పుష్టిగా, ఏపుగా పెరిగివుంది. ఆడది. తల్లి ఒడిలో చంటి పిల్లాడుచేసే అల్లరికంటే ఎక్కువగా వుంది దీని అల్లరి. అమ్మగూడా దాన్ని చంటి పిల్లాడిలాగా ముద్దు చెయ్యటం, మనిషికి చెప్పినట్టు మాటలు చెప్పటం చూస్తోంటే మరీ చిత్రం అనిపించింది నాకు. ఇంతట్లోకి మనసులో మెరిసినట్టుగా యేదో గుర్తొచ్చింది.

'తమ్ముడు పెంచుతున్నది చిన్నకుక్కపిల్ల కదమ్మా!' అన్నాను.

అమ్మ మరోసారి నన్ను పిచ్చివాణ్ణిచేసి నవ్వింది. 'నువ్వూ ఒకప్పుడు చిన్నవాడివే నాయనా. కాని, యిప్పుడూ అలాగే వున్నావా?' అంది.

'అయితే యిది అప్పుడు తమ్ముడు తెచ్చిన చిన్నకుక్కపిల్లేనా?' అన్నాను, యింకా నమ్మకం కుదరక.

'అవును బాబూ. అదే యిది!' అంది అమ్మ.

మరోసారి పరిశీలనగా దానివంక చూశాను. కాని, ఈ ఐదునెల్లలోనే యింత బాగా పెరిగి పెద్దదైందా యీ కుక్క అనిపించింది. ఎంతసేపు చూసినా ఈ కుక్కకీ ఆనాడు నేను చూసిన కుక్కపిల్లకీ ఎక్కడా పోలిక కనిపించలేదు. అది బొద్దుగా, ముద్దుగా పసిపిల్లాడిలా వుండేది. ఇది పుష్టిగా వున్నప్పటికీ శరీరంలోని అవయవాలు ఎక్కడికక్కడ రూపు తేర్పరుచుకుని కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నాయి. అయినా, అమ్మ చెప్పిందికాబట్టి నమ్మక తప్పలేదు.

బట్టలు మార్చుకొని, కాళ్ళూచేతులూ కడుక్కొని మంచం వాల్చుక్కూచున్నాను.

పాతగోనిపట్టా ఒకటి లాక్కొచ్చి, పరుచుకొని నాకు ఎదురుగా పడుకుంది కుక్క!

ఈసారి నాకు చెప్పరానంత ఆశ్చర్యం కలిగింది దాని ప్రవర్తనకు. అదే భావంతో కన్నార్పకుండా దానివంక చూడసాగాను.

'అప్పుడే ఏమైంది నాయనా, యింకా చాలా వున్నాయి నువ్వు చూడవలసినవి. దీనికున్న బుద్ధి మనుషులక్కూడా వుండదేమో అనిపిస్తుంది. దీని పోకడలు మనుషులకే ఆశ్చర్యం కలిగిస్తాయి!' అంది అమ్మ.

బడలికంగావుండి మంచంమీద చారబడ్డాను. ప్రయాణపుబడలికవల్ల వెంటనే కునుకుపట్టేసింది. సుమారు ఒకగంట గడిచింతర్వాత ఎవరో లేపుతున్నట్టయి, నెమ్మదిగా కళ్ళు విప్పాను. కుక్క! తన రెండు ముందరకాళ్లను మంచంమీదపెట్టి, నా కాళ్లనుతట్టి లెమ్మన్నట్టు మూగభాషతో సైగ చేస్తోంది. ఒక్కక్షణంలో నా నిద్రబద్ధకం ఎగిరిపోయింది. పట్టరాని కుతూహలంతో కుక్కవేపు చూడసాగాను. దాని ప్రతిప్రవర్తననూ ప్రత్యేక దృష్టితో పరిశీలించసాగాను.

అయితే, కుక్కలంటే నాకు మంచిఅభిప్రాయం యేర్పడిందనికాదు. కాని, వాటిమీద యింతకుముందు వుండే నీచభావంమాత్రం కొంచెం, తాత్కాలికంగానే కావచ్చు, తొలగి పోయిందనే చెప్పవచ్చు. పైగా అమ్మ చెప్పిన మాటలు విన్నతర్వాత, దీని ప్రవర్తనలో అంత ఆశ్చర్యం కలిగించే పోకడలు ఏ ముంటాయో

తెలుసుకోవాలన్న కుతూహలం యేర్పడి, మరికొంత కొత్త వుత్సాహాన్ని కలిగించింది.

లేచి కూచున్నా వూరుకోలేదు కుక్క. ఏమిటో తన ధోరణిలో మూగసైగలు చెయ్య సాగింది. అక్కడికక్కడే అటూ యిటూ కంగారు కంగారుగా తిరగసాగింది. అన్నీ పరిశీలించ సాగాను. దాని ప్రతికదలికలోనూ ఏదో ఒక భావం వుందని పిస్తోంది నాకు. కాని, దాన్ని అర్థం చేసుకొనే నేర్పు నాకింకా అలవడలేదు. పాపం, అది నోరులేని మూగ జంతువు. నాకు అర్థమయ్యే మనుష్యభాషలో చెప్ప లేక పోవటం దాని లోపంకాదు. దాని మూగభాషని అర్థం చేసుకోలేక పోవటం, మేధాసంపత్తిగల మానవ జాతికి చెందిన నా లోపం మాత్రమే!

'ఏమిటి విషయం?' అన్నట్టు దాని ముఖం లోకి ప్రశ్నార్థకంగా చూశాను, ఏమీ అర్థంకాక.

నా ముఖకవళికల్లోని భావాన్ని యిట్టే అర్థం చేసేసుకుంది. వెంటనే వంట గదిలోకివెళ్లి తోకాడించుకుంటూ మళ్లీ నా దగ్గరికే వచ్చింది.

ఈసారీ దాని భావం నా కర్థం కాలేదు. అది యింకా కంగారుచేస్తూనేవుంది. దాని సంజ్ఞలకి అర్థం తెలీకపోయినా, మొత్తానికి నన్నక్కణ్ణించి లేవ మంటూందనిమాత్రం తెలుసుకోగలిగాను. కాని, తర్వాత?.........

లేచి నిల్చున్నాను. ఈసారి కొంచెం వుత్సాహం కనిపించింది కుక్కలో. మళ్లీ ఒకసారి వంటింట్లోకి వెళ్లివచ్చింది

బహుశా నన్నాగదిలోకి రమ్మంటోందేమో!— అయితే అయ్యుండొచ్చు అనిపించి ఒకడుగు వంటింటి వేపు వేశాను. ఈలోగా ఒక ప్లేటులో ఒక అరడజను గారెలు, ఒక గ్లాసుతో మంచినీళ్లూ పట్టుకొని అమ్మ వచ్చింది.

కుక్క సంతోషానికి అంతులేకపోయింది. నా ఆశ్చర్యానికి అవధుల్లేక పోయినయ్.

'ఏమిటి నాయనా, ఆశ్చర్యంగా చూస్తున్నావా?' అంది అమ్మ, కన్నార్పకుండా కుక్కవంక చూస్తున్న నన్ను చూసి.

'ఈ కుక్క భలేతెలివైందేనమ్మా!' అన్నాను ఆశ్చర్యంగా.

'నోరొక్కటిలేదుగాని, దీని పనులు యిన్నా అన్నా! నోరున్న మామూలు మనుషులకి పదేపదే చెప్తేనేగాని అర్థంగావిమాట దీనికి ఒక్కసారి చెప్తే చాలు; మళ్లీ మరిచిపోదు. ఏదేనా పనిచెప్పినా అంతే. ఒకసారి చేసినపని జన్మలో మళ్లీ మరిచిపోదు. ఎంత గుర్తో మరి దీనికి! వంటింట్లో కంచాలు కదిపిన చప్పుడైతేచాలు, అందర్నీ భోజనాలకు లెమ్మం టుంది. అదీ అన్నివేళల్లోనూకాదు. భోజనాల వేళ ల్లోనే అలా చేస్తుంది. ఇప్పుడు నేను ప్లేటుకడిగి గారెలు వెయ్యటం చూసినట్టుంది. అందుకనే నిన్ను లేచి రమ్మంటోంది. అది నిన్ను లేపటంలో గొప్ప తనమేంలేదుగాని, ఈ గారెలు నేను నీకోసమే తీసుకు వస్తున్నట్టు వూహించటంలోనేవుంది దాని నిశిత బుద్ధి!' అంది అమ్మ.

మా యింటికి సుమారు ఓ వందగజాల దూరంలోవున్న ఎలిమెంటరీ స్కూల్లో 'హాల్‌బెల్' కొట్టారు. దగ్గరగానే వుంటంవల్ల గంట స్పష్టం గానే వినిపించింది. మా తమ్ముడు అందులోనే ఐదవ తరగతి చదువుతున్నాడు.

'స్కూల్ వదిలేసినట్టున్నారు. యింక మన చిన్నాడు వచ్చేస్తాడు' అంది అమ్మ.

ఈ మాట వినిపించుకున్నానుగాని, అంతగా పట్టించుకోలేదు కారణం యింతవరకూ మా మధ్యన వున్న కుక్క ఒక్కసారిలేచి పరిగెత్తిపోయిం దెక్కడికో.

'ఎక్కడికి అలా పరిగెత్తిపోయిందీ కుక్క?' అన్నాను అమ్మ నుద్దేశించి. నేనంటే కొత్తవాణ్ణి కాబట్టి దాని ప్రవర్తనంతా నాకు తెలీదు. కాని, అమ్మకు దాని ప్రతికదలికలోని అంతరార్థం తెలుసు.

'ఇంకెక్కడికి వెళ్తుంది? స్కూలు వదిలి పెట్టారుకదా! చిన్నాణ్ణి తీసుకురావటానికి స్కూలుకి వెళ్లింది. ప్రతిరోజూ వాడి వెనకాలే స్కూలుదాకా వెళ్లి దిగబెట్టివస్తుంది. మళ్లీ గంట వినగానే ఎదురువెళ్లి వాణ్ణి తీసుకొస్తుంది. ఇది దీనికి అల వాటై పోయింది. స్కూలుగంటకొట్టే సమయంలో దీనికేదన్నా తిండిపెట్టినాసరే వాదిలేసి మరీ పారి పోతుంది. వాడంటే అంతప్రేమ దీనికి!' అంది అమ్మ.

ఇంతట్లోకి ఒక చిన్నసంచి నోటితో కరిచి పెట్టుకొనివచ్చి, చాపమీద కూచొనివున్న అమ్మ ఒడిలో పడేసింది కుక్క. అమ్మ ముద్దుగా దాని తలమీదనుంచి వీపుమీదుగా నిమిరింది.

'ఎవరిదీ సంచి?' అన్నాను అమితాశ్చర్యంతో.

'ఇం కెవరిదీ? చిన్నాడిది. వా డక్కడ ఆడు కోవా లనుకున్నప్పుడు పుస్తకాలసంచి దాని కిచ్చి యింటికి తీసుకుపొమ్మంటాడు. ఇది మనుషులకంటే జాగ్రత్తగా యింటికి తీసుకొచ్చి నా కప్పగిస్తుంది. మళ్లీ ఎవ్వరడిగినా యివ్వదు. ఒక పుస్తకాలసంచే అన్న మాటేవిటి—మనది అన్న వస్తువు ఏ వొక్కటి బైట కనిపించినాసరే తిన్నగా యింటికి తీసుకొచ్చే స్తుంది. వాకి లూడ్చి పొరపాటున చీపురు బైట వదిలేశామంటే, జాగ్రత్తగా దాన్ని నోటితో కరిచి పెట్టి యింటికి తీసుకొస్తుంది. ఒకోసారి వంటింట్లో పొయ్యిముందు కూచుని, లేవటానికి బద్ధకించి 'రెండు పిడకలు తెచ్చిపెట్టమ్మా' అంటె చాలు వెంటనే బైట పిడకల కుచ్చిర దగ్గర్నుంచి పిడకలు తీసుకొస్తుంది. చెక్కపేళ్లు తెమ్మన్నా అంతే. కుండ నిండా అన్నం వార్చి, ఏదేనా పనిమీద బైటికి వెళ్లి నప్పుడు దీన్ని కాపలావుంచితే కుక్కనిగాని, పిల్లిని గాని వంటింటి పరిసరాలకే రానీదు. మళ్లీ నేను తిరిగివచ్చేదాకా ఎక్కడ పెట్టింది అక్కడే భద్రంగా వుంటుంది.'

నాకో అనుమానం వచ్చింది— 'బైటవాటిని రానీదు సరే అన్నం కుండ ఎదురుగావుంటే యిది మాత్రం తినకుండా వుంటుందా!' అన్నాను అనుమానంగా.

అమ్మ చిన్నగా నవ్వింది, తన కొడుకు ఎంత అమాయకుడో అన్నట్టు — 'అన్నం కుండే కాదు; కంచంలో అన్నంపెట్టి దానిముందు పెట్టినా సరే 'తిను' అనేదాకా ముట్టుకోదు సరికదా, వాసనకూడా చూడదు. అంత నమ్మకమైంది చిట్టితల్లి!'

ఈలోగా మళ్లీ బైటికి పారిపోయింది కుక్క. నాలుగైదు నిమిషాల్లో మా చెల్లాయిని వెంటబెట్టు కొచ్చింది.

'ఎక్కడిదాకా వచ్చిందమ్మా యిది?' అంది అమ్మ.

'రోడ్డుదాకా వచ్చింది.' అంది చెల్లాయి.

తమ్ముడు చదువుతున్న స్కూలు దగ్గరే కాబట్టి దానిగంట వినిపించి, వాడికి ఎదురువెళ్తుం దనుకోవచ్చు. కాని, చెల్లాయి చదువుతున్న హైస్కూలు సుమారు ఒక మైలుదూరం వుంటుంది. ఆ స్కూలు వదిలేసినట్టు, చెల్లాయి వచ్చేస్తున్నట్టు దాని కెలా తెలుస్తుంది?—బాగా ఆలోచించినమీదట ఒక నమ్మకం కుదిరింది నాకు....మా యింట్లో వ్యక్తుల అలవాట్లు, అవసరాలూ దీనికి తెలుసు. ఎవ్వరు ఎప్పుడు ఏపనిచేసేదీ, ఎప్పుడు ఎక్కడికి వెళ్లేదీ, వచ్చేదీ అన్నీ దానికి తెలుసు. అందరి ప్రవర్తనల్నీ కుణ్ణంగా అర్థంచేసుకుంది. వాటికి అనుగుణంగా ప్రవర్తిస్తూ అందరి మెప్పుల్నీ పొందు తోంది. తద్వారా అందరి హృదయాల్లోనూ చోటు యేర్పర్చుకుంది. మాయింట్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. మా అమ్మ దృష్టిలో అది మా చిట్టి చెల్లాయి. మా స్వంతచెల్లెలి తర్వాత మరో చెల్లెలన్న మాట!

ఆ సాయంత్రం భోజనాల సమయంలోగూడా ఎన్నోచిన్నెలుచేసి, న న్నాశ్చర్యపరిచింది రాణి.

నాలుగు రోజులూ మా రాణిచేసి చూపిన చిత్రాలు చూడ్డంతోనూ, దాని మూగభాషను అర్థం

చేసుకోవటానికి ప్రయత్నించటంతోనూ యిట్టే గడిచి పోయింది నాకు.

* * *

కాలం మారింది. కొద్దిరోజుల్లోనే మా కుటుంబ ఆర్థికపరిస్థితులు అనుకోని విధంగా మార్పు జెందాయి.

మా నాన్నగారికి జబ్బుచేసింది. ఆ పల్లెటూళ్లో సరైన డాక్టర్‌లేక, ఒకవేళ చిన్నరకం డాక్టర్లున్నా అక్కడ వచ్చే ఆదాయంలేక, ఆపదలో ఆదుకొనే అప్పుల్లేకా మకాం నేను పనిచేస్తున్న పట్నానికి మార్చక తప్పిందికాదు. అంత కుటుంబాన్ని నా ఒక్కడి సంపాదనమీదే పోషించవలసివచ్చేటప్పటికి తలకుమించిన బాధ్యతఅయి కూచుంది నాకు.

అందరం అక్కణ్ణుంచి బయల్దేరి వస్తున్నప్పుడు, అంతా ఆలోచించినమీదనే మా రాణిని అక్కడ వదిలెయ్యటం జరిగింది. ఆ విషయం అందరికీ బాధ కలిగించింది. మిగతావారిమాట ఎలావున్నా నేనుమాత్రం చాలా బాధపడ్డాను. ఇన్నాళ్లూ దాన్ని పెంచి, పెద్దచేసి, పరస్పరం వాత్సల్యం పెంపొందించుకొని యిప్పుడు దాన్ని గాలికి వదిలేసి వచ్చెయ్యటంకన్నా ఘోరమైన అన్యాయం మరొకటుండదనిపించింది. అయినా, ఆలోచించింతర్వాత దాన్ని మాతో పట్నానికి తీసుకురావటానికి సాహసించలేకపోయాన్నేను. కారణం ఏమిటంటే, మా కుటుంబ పరిస్థితి యిదివరకటిలా లేదు. అసలే ఆర్థికంగా కొంచెం యిబ్బందిపడుతున్న కుటుంబం మాది. దానికి తోడు మా నాన్నకు జబ్బుచెయ్యటం గోరుచుట్టుమీద రోకటిపోటైంది. ఆయనవల్ల వచ్చే సంపాదన రాకపోగా, ఆయనకే కొంత ఖర్చుపెట్టవలసివచ్చింది మందులకోసం. నా కొచ్చేజీతం రాళ్లతో మా కుటుంబాన్ని పోషించుకోవటమే కనాకష్టం. అలాంటి పరిస్థితిలో యింక రాణినిగూడా తీసుకువస్తే మాతోపాటు దానికీ అర్థాకలిబాధా, పస్తులూ తప్పవు. అందుకనే, ఆ పాపం ఒడికట్టుకోవటం దేనికని, దాన్ని గాలికి వదిలేశాం. అందువల్ల అది సుఖపడుతుందని కాదుగాని, చూస్తూచూస్తూ దాన్ని పస్తులుంచటం యిష్టంలేక అలా చెయ్యవలసివచ్చింది.

అక్కణ్ణించి ప్రయాణమై వచ్చేటప్పుడు ఒక పట్టాన మమ్మల్ని వదిలింది కాదు రాణి. ఆఖరికి, అన్ని ప్రయత్నాలూ విఫలమై, దాన్ని మా యింటి గుంజకు తాడుతో కట్టేసి బయల్దేరాం. అప్పుడది మావంక చూసిన చూపు యిప్పటికీ నా కళ్లముందు కనబడుతోంది. ఆ సమయంలో నా గుండెను ఎవరో రంపంతో ముక్కలు ముక్కలుగా కోస్తున్నట్టు బాధపడ్డాను. అయినా తప్పదు మరి!

* * *

అక్కణ్ణించి వచ్చేముందే మా యిల్లు బేరం పెట్టి అమ్మేశాం. దాని తాలూకు కొంత డబ్బు రావలసివుండి నాలుగు రోజులక్రితం బయల్దేరివెళ్లాను.

ఇంటిముందు నిలబడి, మాకు డబ్బివ్వవలసిన మనిషిని పేరుతో పిలుస్తున్నాను. ఇంతట్లోకి, ఎక్కణ్ణించి, ఎలా పసిగట్టిందో, ఒక్క ఉదుటున వచ్చి ముందరి రెండు కాళ్లూ ఎత్తి నా పొట్టమీద వేసి, కావలించుకున్నంత పనిచేసింది రాణి. దాని కాళ్లనున్న మట్టి నా తెల్లని యిస్త్రీషర్టుకు అంటుకొని ఖరాబు చేసినందుకు కొంచెం కోపం వచ్చినా, దాని ప్రవర్తనలోని ఆత్రుతనీ, ఈ పదిరోజులూ మమ్మల్ని విడిచివుంటూ అది అనుభవించిన వియోగ బాధని చూసి, అర్థంచేసుకుని క్షణకాలం విస్తుపోయాను.

అక్కడవున్న కొంచెంసేపూ రాణి నన్ను అంటిపెట్టుకునే వుండి నానా అల్లరీ చేసింది. నేను పైకి విసుక్కుంటున్నా అది మారాంచేసే ధోరణి చూసి లోలోపల సంతోషించ సాగాను.

ఇల్లు కొన్నవాళ్లు డబ్బు యిచ్చింతర్వాత అక్కణ్ణించి బయల్దేరాను. బయల్దేరేముందు రాణిని గురించి ఒక నిర్ణయానికి వచ్చి మరీ బయల్దేరాను. ఇంతకుముందు రాణిని యిక్కడ గాలికి వదిలివెళ్లటం

కేవలం మూర్ఖం. అది హృదయంవున్న మానవులు చెయ్యవలసిన పనికాదు. కాని, అంతా నా అవివేకం వల్లా, పరికితనంవల్లా జరిగిపోయింది. ఈసారైనా, అవకాశం వచ్చింది కాబట్టి రాణిని తప్పకుండా నాతో పాటు తీసుకుపోవాలి అనుకున్నాను—

కాని, ప్రస్తుతం నేను తిన్నగా మా ఊరు వెళ్లటం లేదు. కారణాంతరంవల్ల అక్కణ్ణించి మరి కొంత దూరంలోవున్న మరో ఊరు వెళ్లవలసివుంది. అయినా, అట్నుంచి వచ్చేప్పుడు యిక్కడ దిగి, రాణిని తప్పకుండా నాతోబాటు తీసుకుపోవాలని గట్టిగా నిశ్చయించుకున్నాను.

బస్సెక్కేంతవరకూ నన్ను వదిలిపెట్టలేదు రాణి. బస్సెక్కుతున్న నాతోబాటు అదీ ఎక్కబో యింది. కాని, నేను ముభావంగా వుంటంవల్ల కండక్టర్ బలవంతాన రాణిని కిందకు నెట్టేసి, డోర్ వేసేశాడు.

వెంటనే బస్ కదిలిపోవటంవల్ల, ఈసారి గూడా మోసంచేసిపోతున్న నావేపు రాణి ఎలాంటి చూపు చూసిందో చూసే అవకాశం నాకు లేక పోయింది. నేను చేసింది మోసంకాకపోయినా, మా రాణికి అది మోసం లాగానే అనిపిస్తుంది అప్పట్లో. ఇప్పుడు నేనే ఒప్పుకుంటున్నాను నేను రాణిని మోసంచేశాను. నేను చేసింది కేవలం మోసంకాదు; ఖూనీ! హత్య!

*    *    *

మరుసటిరోజున, పక్కఊళ్లో పని ముగించు కొని, నిర్ణయించుకున్న ప్రకారం రాణిని తీసుకు వద్దామని ఆ ఊళ్లో దిగాను.

తిన్నగా మా పాతయింటికే వెళ్లాను. కాని, రాణి కనిపించలేదు. బహుశా ఎక్కడికేనా, ఎవరింటి కేనా వెళ్లిందేమో అనుకున్నాను. అయినా, ఎందు కైనా మంచిదని ఒకసారి 'రాణీ'! అని పిలుద్దా మనిపించింది. కాని, అంతకుముందెప్పుడూ పిలిచిన అలవాటు లేకపోవటంచేత నోరు పెగల్లేదు.

ఇంతట్లోకి యింట్లోంచి ఒకాయన బైటికి వచ్చాడు. బజార్లో నిలబడివున్న నన్నుచూసి, 'ఏవిటి మళ్లీ వచ్చారు మీరు!' అన్నాడు ఆశ్చర్యంగా.

'మా రాణికోసం' అన్నాన్నేను.

'ఏ రాణి?'

'మా రాణి అండి. మా పెంపుడుకుక్క రాణి!'

'ఓహో! ఆ నల్లకుక్కా! దాన్ని మీతో తీసుకుపోతారా ఏం?' అన్నాడు ఆశ్చర్యంగా.

'అవునండి.' అన్నాను.

'మంచిది.' అన్నాడాయన.

'అది కనిపించటంలేదండి......' అన్నాను—

'కనిపించటంలేదూ? నిన్న మీరు వెళ్లి నప్పటినుంచి అదసలు మా యింటికే రాలేదు. ఒకవేళ మీరు తీసుకుపోయారేమో అనుకున్నాం!' అన్నాడాయన అమితాశ్చర్యంగా.

ప్రతిమాటకీ ఆయన ఆశ్చర్యపోవటంతప్ప సరైన సమాధానం యిచ్చే సూచనలు కనపడలేదు నాకు. పైగా నేను వచ్చి యింతసేపట్నుంచీ మాట్లాడుతున్నా మా రాణి రాకపోవటం మరీ ఆశ్చర్యం కలిగించింది నాకు. మనసులో యేదో అను మానం తలెత్తుతోంది. కర్తవ్యం తోచక రోడ్డు వేపు నడిచాను.

రోడ్డుమొగలో చిన్న'టీస్టాల్' వుంది. వచ్చే పోయే బస్సులు అక్కడే ఆగుతాయి. బైట పందిట్లో వేసివున్న బల్లమీద కూచుని ఒక టీ చెయ్యమన్నాను. ఇంతట్లోకి ఏదో దుర్వాసన వేస్తోంటేను, 'ఏవిం టయ్యా ఈ వాసన?' అన్నాను కొట్టతనితో.

అతను నాకు సమాధానం చెప్పకుండా, కప్పులు కడిగే కుర్రాణ్ణి దగ్గరకుపిలిచి, 'ఏరా, ఆ చచ్చిన కుక్కని దూరంగా పారేసిరారా అంటే, గాలి కెగువ యింతదగ్గిర్లో వేశావేరా? వాసనతో చచ్చిపోతున్నాం. కొట్లో కూచోలేకపోతున్నాం. ఇప్పుడైనాపోయి, దా

కాలి కో తాడుకట్టి దూరంగా ఈడ్చేసిరా. ఫో!' అన్నాడు గట్టిగా.

నాక్కొంచెం అనుమానం కలిగింది. అసలే, మనసులో యింతకుముందూ అనుమానరేఖ పొడ చూపింది.

'ఏమండీ, కుక్క చచ్చిపోయిందా?' అన్నాను.

చేసిన టీ గ్లాసు నా పక్కనే బల్లమీదపెడ్తూ అదోలా చూశాడతను నా వంక. అయినా, సమాధానం చెప్పాడు.

'అవునండి నిన్నే చచ్చిపోయింది' అన్నాడు.

'నిన్నా! ఎలా వుంటుందండి ఆ కుక్క?' అన్నాను కొంచెం కంగారుగా.

ఈసారి నా కంగారుచూసి, నిజంగా నన్నో పిచ్చివాడికింద జమకట్టి ఆ ధోరణిలోనే నా వంక చూశాడతను. అయినా, నాక్కొంచెం వుపకారం చేశాడు.

'అఁ. మామూలుదేనండి కుక్క. ఏమంత జాతిరకంకాదు. నల్లగా వుంటుంది' అన్నాడు.

నేను టీ సంగతి మర్చిపోయాను. పక్కనే వున్న టీ గ్లాసులోంచి పైకివస్తున్న ఆవిరికంటే ఎక్కువగా నా గుండెల్లోంచి దుఃఖంపొంగి బైటికి రాసాగింది.

'ఎలా చచ్చిపోయిందండి?' అన్నాను.

'నేను చూడలేదుగాని, మా కుర్రాడు చెప్పాడు. అది పెంపుడుకుక్కే. నిన్న ఈ వేళప్పుడే దీన్ని పెంచి నతను యిక్కడే బస్సెక్కాడట. ఇది గూడా పైకి ఎక్కబోతుంటే కిందికి గెంటేశారట. బస్సు కదిలిపోయింతర్వాతగూడా యిది వూరుకోక బస్ వెన కాల పడిందట. దాని కర్మ కాకపోతే యింతట్లోకి వెనకమంచి ఒక లారీ స్పీడుగా రావటం, కంగార్లో యిది తప్పుకోలేక దానికిందపడి పచ్చడిపచ్చడికింద నలిగిపోవటం అంతా కన్నుమూసి కన్ను తెరిచేలోగా జరిగిపోయిందట. అయినా ఈ లారీవాళ్ళా కన్నూ మిన్నూ కానటం లేదండి!' అన్నాడు.

అంతా విన్నతర్వాత నేను నిశ్చేష్టుణ్ణై పోయాను. నా అనుమానం అంతా నిజమే అయింది. చచ్చిపోయింది మా కుక్క రాణియే!

'అదిగోండి. అది లారీకిందపడి చచ్చిపోయిందక్కడే!' అని వేలెత్తి చూపించాడతను, ఓ యిరవై గజాల దూరంలో.

నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ, యాంత్రికంగా అటు నడిచాను. మా రాణి లారీకింద పడి నలిగిపోయినచోట రక్తం చాలా కారివుంటుంది. నిన్నట్నుంచి ఎన్నోలారీలు, కార్లు ఆ రక్తపు మరక మీంచి నడిచివుంటాయి. అయినా, యింకా మరక స్పష్టంగా కనిపిస్తూనేవుంది—ఎర్రగా!

అక్కణ్ణించి హోటల్ కుర్రాడు వెళ్ళినవేపు నడిచాను. కాని, అంతదూరం వెళ్ళకముందే ఆ హృదయ విదారక దృశ్యం నా కంటపడింది.

నా రెండు కళ్ళూ అశ్రుజల పూరితాలయి, ఒక్కక్షణం ఏమీ కనిపించకుండా పోయింది. నా శరీరం వశం తప్పింది. ప్రతినరంలో నిస్సత్తువ వ్యాపించింది.

ఏ జీవికైనా ప్రాణం శాశ్వతంకాదు. మొదట్లో నేను అవివేకంతో రాణిని వదిలిపెట్టి వెళ్ళాను. అయినా, ఈసారి తప్పకుండా నాతో తీసుకుపోవాలని నిశ్చయించుకున్నాను. కాని, యింతట్లో ఈ దారుణం జరిగిపోయింది. ముందుక్షణంలో ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు!

ఈ చావుకబురు యింటికి మోసుకువెళ్ళే బాధ్యత నామీద పడింది. ఈ వార్త విన్నతర్వాత, మా యింటిల్లిపాదీ అమితంగా దుఃఖించారు. మా అమ్మైతే మరీను. నాలుగైదు రోజులు అన్నంగూడా సయించలేదు నాకు.

మా రాణి జాతికుక్క కాదు. సాధారణమైన ఊరకుక్క. ఎక్కడో బజార్లో ఏదో కుక్క ఈనిన పిల్లల్లో ఒకదాన్ని ఎత్తుకొచ్చాడట మా తమ్ముడు. నల్లగా నిగనిగలాడుతూవుండే మా రాణి మనసు అత్యంతము తెల్లన. దానికి మేం పెట్టిన తిండికన్నా అది మామీద చూపించిన విశ్వాసం ఎక్కువ. దానికి మా కుటుంబం యెంతో ఋణపడివుంది. ఆ ఋణం ఎప్పటికీ తీరనిది. అయినా, అప్పుడప్పుడు దాని వియోగం వల్ల మా కుటుంబసభ్యులకు కలిగే బాధవల్ల ఏనాటికైనా దాని ఋణం తీర్చుకొని, ఋణ విముక్తులం కాగలమేమోనని ఆశిస్తున్నాను.